పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

సారంగాపూర్: చిన్న కొల్వాయిలో ఇసుక రీచ్‌ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

- కలెక్టర్ సత్యప్రసాద్
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష

జగిత్యాల, జనవరి 7: జిల్లాలో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన జిల్లా పంచాయతీ అధికారి, డీఆర్డీవో, అదనపు కలెక్టర్, ఎంపీడీవోలు, ఎంపీవోలతో వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎంపీడీవోలు, ఎంపీవోలు ప్రతి రోజూ గ్రామాలను సందర్శించి, పంచాయతీ కార్యదర్శులు చేపట్టే పనులను పరిశీలించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు జరిగేలా చూడాలని, చెత్తను సేకరించి డంప్ యార్డుకు తరలించాలన్నారు. 100 శాతం ఇంటి పన్నులు వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో తాగునీటి సరఫరాలు అంతరాయం లేకుండా చూడాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయడానికి ఆదేశాలు జారీ చేయాలన్నారు.

సఖీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

జిల్లా కేంద్రంలో తేజస్ ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖీ కేంద్రాన్ని కలెక్టర్ బీ సత్యప్రసాద్ మంగళవారం సందర్శించారు. సఖీ సెంటర్‌లో రికార్డులను పరిశీలించి, క్లిష్టమైన కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సఖీ సెంటర్ సిబ్బంది పని తీరు బాగుందని అభినందించారు. జిల్లా సంక్షేమాధికారి డాక్టర్ నరేశ్, తేజస్ ఫౌండేషన్ ట్రస్టు సీఈవో అటుకుల శ్రీనివాస్, సఖీ కేంద్రం సీఏ లావణ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేదలకే ఇందిరమ్మ ఇండ్లు

సారంగాపూర్, జనవరి 7: గ్రామాల్లో అర్హత గల నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. బీర్‌పూర్ మండల కేంద్రంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. యాప్ ద్వారా సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ పథకం కింద అర్హత గల నిరుపేదలను గుర్తించి ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. సర్వే త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, బీర్‌పూర్ మండలం చిన్న కొల్వాయి గ్రామంలో ఇసుక రీచ్‌ను సంబంధిత శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు 118 ట్రాక్టర్ల ఇసుక డంపును రెవెన్యూ, మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుక అక్రమ రవాణా జరగకుండా పక్కగా భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇసుక రీచ్‌ల నుంచి మాత్రమే రవాణ చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పట్టుకుని సీజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా మైనింగ్ అధికారి జైసింగ్, తహసీల్దార్ ముంతాజొద్దీన్, ఎంపీడీవో లచ్చాలు, ఆర్ఐ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మానవ తప్పిదంతోనే రోడ్డు ప్రమాదాలు

జగిత్యాల, జనవరి 7: ఓవర్ స్పీడ్, నిర్లక్ష్య డ్రైవింగ్ అనే మానవ తప్పిదాల వల్లనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టాల్సిన బాధ్యత డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. జగిత్యాల కొత్త బస్టాండ్‌లో డిపో మేనేజర్ సునీత ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను ఆర్టీసీ, రవాణా శాఖ సంయుక్తంగా నిర్వహించారు. కాగా, ముఖ్య అతిథులుగా డీటీవో పాటు జగిత్యాల పట్టణ సీఐ వేణుగోపాల్, ఎంవీఐలు రామారావు, అభిలాష్, ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం, కవితారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీటీవో శ్రీనివాస్ మాట్లాడుతూ, చిన్న నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగితే కుటుంబం రోడ్డున పడుతుందని, కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని డ్రైవింగ్ చేయాలన్నారు. ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా వాహనం నడపాలని ట్యాక్సీ, ఆటో, కార్లు, ఇతర పెద్ద వాహనాల డ్రైవర్లకు సూచించారు. మైనర్లకు వాహనం ఇవ్వవద్దన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. సీఐ వేణుగోపాల్ మాట్లాడుతూ, నిర్లక్ష్యం, దూకుడుతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని, తాగి డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు జరుగకుండా, కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడపాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమానికి హాజరైన వారిని డిపో మేనేజర్ సునీత సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ, రవాణా శాఖ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అందుకున్న సెల్ ఫోన్లతో బాధితులు

సెల్‌ఫోన్లు దొరికినయ్

- చోరీకి గురైన రూ. 18 లక్షల విలువైన ఫోన్లు అప్పగించిన ఎస్పీ

జగిత్యాలలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చోరీకి గురైన రూ. 18 లక్షల విలువైన 120 సెల్ ఫోన్లను ఎస్పీ అశోక్‌కుమార్ బాధితులకు అప్పగించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సెల్ ఫోన్ చోరీకి గురైన వారు ఆందోళన చెందవద్దని, సీఈఐఆర్ అప్లికేషన్ (వెబ్‌సైట్) ద్వారా దొరుకుతుందని తెలిపారు. జిల్లాలో పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ప్రత్యేకంగా పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 786 సెల్ ఫోన్లను రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. సెల్ ఫోన్లను రికవరీ చేసిన ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ రఫీఖాన్, సీఈఐఆర్ టీం ఆర్ఎస్ఐ కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ మహమూద్, కానిస్టేబుళ్లు అజర్, యాకూబ్‌ను అభినందించారు.

-జగిత్యాల కలెక్టరేట్, జనవరి 7

రైతులకు పెట్టుబడి సాయం ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే

జగిత్యాల, జనవరి 7: దేశ చరిత్రలో రైతులకు పెట్టుబడి సాయం ఇచ్చిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రైతు భరోసా కింద ఎకరానికి రూ.15000 చొప్పున ఇస్తామని చెప్పి, ఇప్పుడు రూ.12000 ఇస్తామని ప్రకటించడాన్ని నిరసిస్తూ మంగళవారం ఆమె జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలో రైతులతో కలిసి పొలంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడుతూ, రైతన్నను రాజుగా చేయాలన్న లక్ష్యంతో ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా రైతుబంధు పథకాన్ని కేసీఆర్ ప్రారంభించి అమలు చేసారన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ. 15000 చొప్పున ఇవ్వాలని, రూ. 2 లక్షల రుణమాఫీ ఎలాంటి నిబంధనలు లేకుండా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ అందరికీ ఏకకాలంలో రుణమాఫీ అయిందని, పేద రైతులకు న్యాయం చేశామని అంటున్నారని, క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతులతో మాట్లాడి నిజ నిజాలు తెలుసుకోవాలన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు సున్నం పెట్టిన ఘనత రేవంత్ రెడ్డి సర్కార్‌దేనన్నారు. రూరల్, అర్బన్ మండలాల అధ్యక్షులు ఆనంద రావు, తుమ్మ గంగాధర్, ఆసిఫ్, నాయకులు కమలాకర్ రావు, గంగరావు, గంగారెడ్డి, ప్రవీణ్, లక్ష్మణ్, సన్నిత్ రావు, చందు, శరత్ రెడ్డి, మహేశ్, శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏర్పాట్లపై సమీక్ష

ధర్మపురి, జనవరి 7: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 10న నిర్వహించే వైకుంఠ ద్వార దర్శనం కార్యక్రమంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. స్థానిక ఆలయ కార్యాలయంలో మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో ముక్కోటి ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, ముక్కోటి ఏకాదశి రోజున వైకుంఠద్వార దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి నదిలో, పట్టణంలో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. పోలీస్ సిబ్బంది భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా వరదవెల్లి గ్రామానికి చెందిన శ్రీహర్ష పీచర సహకారంతో రూ.1.25 లక్షలతో విచారణ కేంద్రం ఏర్పాటు చేయగా విప్ ప్రారంభించారు. దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణచైతన్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సత్తెమ్మ, కమిషనర్ శ్రీనివాస్, సీఐ రాంనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపు సీజ్

మెట్‌పల్లి రూరల్, జనవరి 7: మండలంలోని ఆత్మనగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును సీజ్ చేసినట్లు ఆర్ఐ ఉమేశ్ తెలిపారు. అక్రమంగా నిలువ ఉంచారన్న సమాచారం మేరకు దాడి చేయగా, పది ట్రాక్టర్ ట్రిప్పుల సామర్థ్యం గల ఇసుక డంపును గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై కలెక్టర్ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

చిన్నారికి బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ అవార్డు

రాయికల్, జనవరి 7: ఇటిక్యాల మోడల్ స్కూల్లో 7వ తరగతి చదువుతున్న మల్యాల నరేశ్-లత దంపతుల కూతురు నేహాశ్రీకి బాబా అసోసియేషన్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ అవార్డు ప్రదానం చేశారు. కాగా, నేహాశ్రీ చిన్నతనం నుంచే భరతనాట్యం, ఫోక్ డ్యాన్స్, షార్ట్ ఫిలిం, సినిమా డ్యాన్స్‌లో శిక్షణ పొందుతూ ప్రదర్శిస్తున్నది. నేహాశ్రీని గ్రామస్తులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం, జనవరి 7: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 తరగతిలో 100 సీట్లు, 7,8, 9, పదో తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను వచ్చే నెల 28వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రక్తదానం

మేడిపల్లి, జనవరి 7: కోరుట్ల పట్టణానికి చెందిన అరిసెల్ల లింగయ్య అనారోగ్యంతో బాధపడుతూ జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో చేరాడు. డాక్టర్ పరీక్షించి చికిత్స సమయంలో రక్తం అవసరమని కుటుంబసభ్యులకు తెలిపారు. కుటుంబసభ్యులు మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ తొగరి లక్ష్మీపతిని సంప్రదించారు. తొగరి లక్ష్మీపతి సూచన మేరకు స్పందించిన రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన మంగళారపు శ్రీనివాస్ దవాఖానకు వెళ్లి రక్తదానం చేశారు. మంగళారపు శ్రీనివాస్‌ను డాక్టర్లు, మిత్రులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

గానకోకిల కళానికేతన్ వార్షికోత్సవం

జగిత్యాల టౌన్, జనవరి 7: జిల్లా కేంద్రంలోని శుభమస్తు కన్వెన్షన్ హాల్ (టౌన్ హాల్)లో గానకోకిల కళానికేతన్ 32వ వార్షికోత్సవాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విశిష్ట అతిథులుగా పుష్ప-2 సింగర్ లక్ష్మి, టీవీ సీరియల్స్ ఆర్టిస్టులు పూజా నాగేశ్వర్, లాస్య స్మైలీ హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ఎల్ కార్తికేయ, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, కౌన్సిలర్లు, గాన కోకిల కళానికేతన్ సభ్యులు పాల్గొన్నారు.

త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల, జనవరి 7: జిల్లాలో గురువారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎస్ఈ సాలియా నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల (హైదరపల్లి)లో 220 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటులో భాగంగా కొత్తలైన్ నిర్మాణం, ఎల్‌సీ కారణంగా పూడూర్, గంగాధర, కోరుట్ల, కథలాపూర్, గోదూరు సబ్‌స్టేషన్ల ద్వారా సరఫరా అయ్యే కొడిమ్యాల, మల్యాల, పెగడపల్లి, కోరుట్ల, మెట్‌పల్లి, కథలాపూర్, బీమారం, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలకు త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

అడ్మిషన్ల కోసం అధ్యాపకుల ప్రచారం

జగిత్యాల, జనవరి 7: జగిత్యాలలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రిన్సిపాల్ డాక్టర్ అరిగెల అశోక్ ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆడెపు శ్రీనివాస్, అధ్యాపకులు మంగళవారం ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కళాశాలలో కోర్సులు, వసతుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పీ రాజు, డా. జీవీఆర్ సాయిమధుకర్, అంకం గోవర్ధన్, లైబ్రెరియన్ సురేందర్, సిబ్బంది శ్రీనివాస్, వేణు, గణపతి, ప్రమోద్, దివ్యరాణి, స్వరూప, ప్రతిభ పాల్గొన్నారు.

క్రీడలకు సర్కారు పెద్దపీట

పీడీ రవీందర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, జనవరి 7: క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. సారంగాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ రవీందర్ ఖోఖో ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో టెక్నికల్ ఆఫీసర్‌గా నియామకం కాగా, జగిత్యాలలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా రవీందర్‌ను శాలువాతో సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడువాల లక్ష్మణ్, చెట్‌పల్లి సుధాకర్, పీడీలు భాస్కర్ రెడ్డి, విజ్ఞాన్, నాయక్, సామంత్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల రూరల్, జనవరి 7: ఖోఖో ఇంటర్నేషనల్ టెక్నికల్‌గా ఎంపికైన పీడీ రవీందర్‌ను మంగళవారం పట్టణంలో జిల్లా పేట కార్యవర్గ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పేట రాష్ట్ర జనరల్ సెక్రటరీ కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, కార్యదర్శి అశోక్, పీడీలు, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోకు వినతి

మెట్‌పల్లి, జనవరి 7: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలని, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, ఖాళీ అయిన పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మెనూ చార్జీలను పెంచాలని, బీఎల్వో విధులను రద్దు చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు భాగ్యలక్ష్మి, సుమలత, లావణ్య, షమీం సుల్తానా, రోదసి పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గం

కథలాపూర్, జనవరి 7: నాయీ బ్రాహ్మణ సేవా సంఘం మండల కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కథలాపూర్ మహేశ్, ఉపాధ్యక్షుడిగా చింతకుంట నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా చెట్‌పల్లి ప్రసాద్, కోశాధికారిగా రాచమల్ల రాజేశ్, ముఖ్య సలహాదారుగా చెట్‌పెల్లి అంజయ్య, గౌరవాధ్యక్షుడిగా సామనపల్లి రవీందర్, పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు.

యాదవులు ఐక్యంగా ఉండాలి

కథలాపూర్, జనవరి 7: యాదవులు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని సిరికొండ గ్రామంలో మంగళవారం యాదవ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు ఆశన్న, రాజు, కొండయ్య, గంగారాం, మహేశ్ పాల్గొన్నారు.

విప్‌ను కలిసిన టీఎన్జీవోలు

జగిత్యాల టౌన్, జనవరి 7: ధర్మపురిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు మధుకర్, విద్యాసాగర్, శ్రీనివాస్, నాగరాజు, గణేశ్, షాహిద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాలలకు వంట సామగ్రి పంపిణీ

ఇబ్రహీంపట్నం, జనవరి 7: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన వంట పాత్రలను ప్రభుత్వం సరఫరా చేయగా, ఎంఈవో బండారి మధు మంగళవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఈవోలకు సత్కారం

కథలాపూర్, జనవరి 7: మండల కేంద్రంలోని రైతు వేదికలో బదిలీపై వెళ్తున్న ఏఈవోలు ఎండీ ఫమీనా, వినీత, వైష్ణవిని మంగళవారం రైతులు శాలువాలతో సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏవో యోగిత, ఏఈవోలు శేఖర్, హరీశ్, రైతులు పుర్కుటపు నర్సారెడ్డి, గడ్డం చిన్నారెడ్డి, తిరుమల్‌రెడ్డి, హన్మంతరెడ్డి, గంగారెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

శంకర్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మీనరసింహారావు

మేడిపల్లి, జనవరి 7: భీమారం మండల కేంద్రానికి చెందిన ఆకునూరి శంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులను మంగళవారం బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. వారి ఆర్థిక ఇబ్బందులను తెలుసుకొని, శంకర్ కుమారుడు శివ హోటల్ మేనేజ్‌మెంట్ తృతీయ సంవత్సరం ఫీజు తాను చెల్లిస్తానని, పై చదువుల కోసం ఆర్థిక సాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. అలాగే, భీమారం మండలం కమ్మరిపేటకు చెందిన భీనవేని లస్మక్క మృతి చెందగా, ఆమె కుమారుడు రెడ్డిని పరామర్శించారు. కమ్మరిపేటకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఖాజావుద్దీన్ కాలుకు శస్త్ర చికిత్స చేయించుకోగా, పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు పల్లి అర్జున్, చెన్న మనేని అజిత్‌రావు, సుదవేని భూమేశ్‌గౌడ్, కాచర్ల సురేశ్, మకిలి దాస్, రవీందర్‌రావు, చెక్కపల్లి రఘు, రాజు, మధుకర్‌రావు, ఎండీ రాజబోసు, పరమేశ్వర్, ఆదిరెడ్డి, నర్సయ్య, గంగారాజం, రామాంజనేయులు, భూమయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల మండల అభివృద్ధికి కృషి చేస్తా

మాట్లాడుతున్న అల్పోర్స్ అభినేత నరేందర్‌రెడ్డి

కొడిమ్యాల, జనవరి 7: రాబోయే రోజుల్లో కొడిమ్యాల మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అల్పోర్స్ విద్యా సంస్థల అధినేత, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఉట్కూరి నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన ఆత్మీయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, కొడిమ్యాల బిడ్డగా విద్యాసంస్థలను స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే మండల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కొడిమ్యాల బస్టాండ్ నుంచి అంగడి బజార్ వరకు రోడ్డు విస్తరణ, చిలుక వాగును అభివృద్ధి చేస్తానని చెప్పారు. అనంతరం నరేందర్‌రెడ్డిని పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో సేవలను వినియోగించుకోవాలి

పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్

మల్లాపూర్, జనవరి 7: గ్రామాల్లోని ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. దవాఖానలో రికార్డులను, పరిసర ప్రాంతాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ, పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని, బీపీ, షుగర్ మాత్రలు అందించాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా గ్రామాల్లో గర్భిణులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, మండల వైద్యాధికారి వాహిని, సీహెచ్‌వో రాంమోహన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

కథలాపూర్, జనవరి 7: మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు కథలాపూర్‌లోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం పరీక్షలపై ఉపాధ్యాయులు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాము, ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎం మారంపల్లి అర్జున్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మామిడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పులికాంత శశిధర్, అల్లె పరమేశ్వర్, కృష్ణారావు, ఉశకోల విశ్వనాథం, ఎండీ ఖలీద్‌పాషా, సుధాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సత్కారం

జగిత్యాల రూరల్, జనవరి 7: మెరుగైన వైద్య సేవలందించి ఎన్‌క్యూఎస్‌లో అర్హత సాధించిన కల్లెడ పీహెచ్‌సీ, మోతే ఆరోగ్య ఉప కేంద్రం వైద్య సిబ్బందిని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అభినందించి, సన్మానించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, జాతీయ స్థాయి ప్రమాణాలు పాటించి మరింత మెరుగైన వైద్య సేవలందించడానికి అర్హత సాధించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అర్చన, డాక్టర్ జైపాల్ రెడ్డి, వైద్యాధికారులు సతీశ్, సౌజన్య, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాల టౌన్/రూరల్, జనవరి 7: జిల్లా విద్యాధికారి కార్యాలయంలో యూటీఎఫ్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్లను జిల్లా విద్యాధికారి రాము వేర్వేరుగా ఆవిష